సాక్షి
నల్లగొండ
శనివారం | 4 | జనవరి | 2025





**గంజాయి విక్రేతల అరెస్ట్**
ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి కోదాడలో విక్రయిస్తున్న పలువురిని పోలీసులు పట్టుకున్నారు. - 10లో



**దుకాణాల్లో చోరీ**
పెద్దవూరలోని మూడు దుకాణాల్లో దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. - 10లో



**బుద్ధవనం.. అద్భుతం**
బుద్ధవనంలోని శిల్పాలు అద్భుతమని విదేశీ బౌద్ధ పరిశోధకులు సారా కెన్డర్ లైన్, జాఫ్రిషా అన్నారు. - 12లో

## న్యూస్‌రీల్

### వైద్యులు చిత్తశుద్ధితో పనిచేయాలి



డయాలసిస్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ : వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మర్రిగూడ మండల కేంద్రంలోని సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మర్రిగూడ సీహెచ్ సీలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం రోగులకు ఎంతగానో ఉపయోగ పడుతుంద న్నారు. మర్రిగూడ మండల సమీప గ్రామాల కిడ్నీ రోగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రోగుల సంఖ్యను బట్టి 24గంటలు డయాలసిస్ కేంద్రం పనిచే యాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ మాతృ, సూప రింటెండెంట్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

### ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

- ఎస్పీ శరత్ చంద్ర పవార్



పోలీసుల సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ

హాలియా : పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం ఆయన హాలియా పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, స్థితిగతుల గురించి ఎస్‌ఐ సతీష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాకప్, ఎస్‌హెచ్‌ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి.. సత్వర న్యాయం జరిగేలా పని చేయాలన్నారు. ఎస్పీ వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### ఉత్తమ మహిళా రైతు అవార్డు అందజేత



ఉత్తమ మహిళా రైతు అవార్డుతో వెంకటమ్మ

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన మహిళ రైతు పాల గోని వెంకటమ్మ జిల్లాస్థాయి ఉత్తమ మహిళా రైతుగా ఎంపికయ్యారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెంకటమ్మకు ఉత్తమ మహిళ రైతు అవార్డును అందజేశారు. వెంకటమ్మ 30 ఏళ్లుగా ఉరుమడ్ల గ్రామంలో తనకున్న పద మూడు ఎకరాల్లో కూరగాయాలు, వరి, పత్తితో పాటు పలు రకాల పంటలను పండిస్తున్నారు. అవార్డు అందుకున్న వెంకటమ్మను పలువురు అభినందించారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ

త్రిపురారం : ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ ప్రకాశ్ అన్నారు. శుక్రవారం నిడమనూరు మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. నెల రోజుల్లో ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ ఆంజనేయులు, కాంట్రాక్టర్ జితేందర్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





**కనులపండువగా లక్ష పుష్పార్చన**

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నల్లగొండలోని సిద్దార్థ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు, స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

## టీచర్లు హెల్మెట్‌తో వస్తేనే అటెండెన్స్ వేయాలి

- ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి

నల్లగొండ : ఉపాధ్యాయులు బైక్‌పై హెల్మెట్ ధరించి పాఠశాలకు వస్తేనే వారికి అటెండెన్స్ వేయాలని ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వాణి హెడ్మాస్టర్లకు సూచించారు. శుక్రవారం డాన్‌బాస్కో పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన సభ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చేతుల మీదుగా.. రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వాణి మాట్లాడుతూ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయన్నారు. మన భద్రత కోసమే రోడ్డు భద్రతా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కుటుంబ పెద్దను కోల్పోతే ఆ కుటుంబం ఎంత ఇబ్బంది పడుతుందో ఊహించుకుంటేనే బాధ కలుగుతుందన్నారు. వాహనం నడిపేప్పుడు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, ఆర్‌టీఏ అధికారులు పాల్గొన్నారు.

# ‘పైలెట్’తో పరిష్కారం!

## తిరుమలగిరిసాగర్ మండలంలో కొలిక్కి వస్తున్న భూ సమస్యలు

- ప్రత్యేక అధికారి నేతృత్వంలో 23 వేలకుపైగా ఎకరాల్లో సర్వే పూర్తి
- కాగితాల్లోనే ఉన్న అనర్హుల పేర్లు తొలగింపు
- సాగు చేసుకుంటున్న వారికే పట్టాలు ఇచ్చేలా చర్యలు
- ఈ నెలాఖరులో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ



తిరుమలగిరి సాగర్ మండలంలో భూ సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : తిరుమలగిరి సాగర్ మండలంలో భూ సమస్యల పరిష్కారం కొలిక్కి వస్తోంది. రాష్ట్రంలో అత్యధికంగా భూ సమస్యలు నల్లగొండ జిల్లా తిరుమలగిరిసాగర్ మండలంలోనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సమస్యల పరిష్కారానికి పూనుకున్న విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్‌గా నారాయణరెడ్డి పని చేసిన సమయంలో ప్రత్యేక అధికారిని నియమించి మండలంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. ఆ ప్రక్రియ ప్రసుతం చివరి దశకు చేరుకుంది. అర్హులైన వారికి ఈ నెలాఖరులో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

**గత అధికారుల ఇష్టారాజ్యం**
గతంలో మండలంలో రెవెన్యూ శాఖలో పని చేసిన వారు కొందరు ఇష్టానుసారంగా వ్యవహరించారు. భూమి ఎక్కడ ఉందో తెలియకపోయినా రికార్డుల్లో ఎక్కించారు. ప్రస్తుతం వాటన్నింటిని పరిశీలించి అర్హులను గుర్తిస్తున్నారు. ప్రధానంగా కబ్జాలో లేకుండా కాగితాల్లోనే పేర్లు ఉన్న వారి దరఖాస్తులను తిరస్కరించే ప్రక్రియ కొనసాగుతోంది.

**పట్టాలుంటే భూమి లేదు.. భూమి ఉంటే పట్టాల్లేవ్**
తిరుమలగిరి సాగర్ మండలంలో మండలంలోని 27 వేల ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఆయా భూముల్లో చాలా మందికి పట్టాలు ఉంటే భూమి లేదు.. భూమి ఉన్న వారికి పట్టాలు లేవని జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఆ భూముల్లో అందులో పట్టాల కోసం దాదాపు 24 వేల ఎకరాల్లో సర్వే చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ప్రత్యేక అధికారి నేతృత్వంలో 14 రెవెన్యూ, సర్వే బృందాలు, 80 మంది సిబ్బందితో సర్వే నిర్వహించింది. ఆ సర్వే దాదాపు 95 శాతం వరకు సర్వే పూర్తి కావచ్చినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

**మండలంలో మూడు రకాల భూములు**
నాగార్జున సాగర్ ప్రాజెక్టును ఆనుకుని ఉన్న తిరుమలగిరి సాగర్ మండలంలో 2800 ఎకరాలు కాందిశీకుల భూములు (ఎవాక్యూ ప్రాపర్టీ), 4500 ఎకరాలు అటవీ భూములు, మిగితావి ప్రభుత్వ భూములు ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. వచ్చిన దరఖాస్తుల్లో కొందరు ఫారెస్టు భూముల్లో, ఎవక్యూ ప్రాపర్టీలో, ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న వారు ఉన్నారు. మొత్తానికి ఇప్పటివరకు 4 వేల మందికిపైగా అర్హులైన రైతులు ఉన్నట్లుగా అధికారులు తేల్చారు. ప్రభుత్వ భూమికి పట్టాలు జారీ చేసే అధికారం కలెక్టర్‌కు ప్రభుత్వం ఇటీవల ఇచ్చింది. దీంతో వాటిల్లో పట్టా సర్టిఫికెట్లను కలెక్టర్ జారీ చేయవచ్చు. అయితే కాందిశీకుల భూములు, అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఎలా జారీ చేయాలనే విషయంలో జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక పంపింది.

**ఈ నెలలోనే రైతులకు పట్టాలు**



తిరుమలగిరి సాగర్ మండలంలో అర్హులైన వారికి పట్టాలు జారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానికి సంబంధించిన సర్వే దాదాపు పూర్తి కావచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగిసిన తర్వాత ఈ నెలాఖరులోగా ఆయన చేతుల మీదుగా పట్టాల పంపిణీకి చర్యలు చేపడుతున్నాం. వాటిల్లో నియోజవకర్గంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారు.

– కుందూరు జయవీర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగార్జునసాగర్

# అన్నింటికీ మూలాధారం సైన్స్



సైన్స్ ఫెయిర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- నల్లగొండలో సైన్స్ ఫెయిర్ ప్రారంభం

నల్లగొండ : ప్రపంచంలో అన్నింటికీ మూలాధారం సైన్స్ అని, సైన్స్ లేకుండా రోజు గడవదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండలోని డాన్ బోస్కో పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఆమె.. ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జీవనశైలిని సైతం మార్చే శక్తి సైన్స్‌కు ఉందన్నారు. ప్రపంచంలో ప్రతి అంశానికి సైన్స్, గణితం పునాది వంటివన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాక్షించారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ సైన్స్‌తోనే అన్నీ అభివృద్ధి చెందుతున్నాయన్నారు. విద్యార్థుల మదిలో సైన్స్ చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. 'నా మతం సైన్స్–నేను సైన్స్‌ని నమ్ముతాను' అని సీవీ రామన్ చెప్పిన కొటేషన్‌ను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉపాధ్యాయులంతా సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి డీఈఓ బి.భిక్షపతి స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, డాన్ బోస్కో స్కూల్ ప్రిన్సిపాల్ బాలశౌరి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్ డీఈఓ

## ఈ–వేస్ట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో ఈ–వేస్ట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. పనికిరాని ఎలక్ట్రానిక్ సామగ్రిని ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల పర్యావరణం కలుషితమై, ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని తెలిపారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించేందుకు ఈ– వేస్ట్ మేనేజ్మెంట్ బాగా ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ– వేస్ట్ మేనేజ్మెంట్, వేస్ట్ రీసైక్లింగ్ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఈ– వేస్ట్ మేనేజ్మెంట్ ప్రతినిధి విజయకుమార్, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, జూనియర్ సైంటిస్ట్ రాజేష్ పాల్గొన్నారు.

**ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి**
కట్టంగూర్ : ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కట్టంగూర్ తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో ఉన్న పెండింగ్ భూసమస్యలను వెంటనే పరిష్కరించి.. డిజిటల్ సంతకం చేయని రైతులను గుర్తించి వారిచే సంతకం చేయించాలని సూచించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, వైద్యాధికారి శ్వేత, డీటీ సుకన్య ఉన్నారు.

### ముగిసిన పారా మెడికల్ పరీక్షలు

నల్లగొండ టౌన్ : పారామెడికల్ పరీక్షలు శుక్రవారంతో ముగిసినట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు గత నెల 23 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు జరిగిన పరీక్షలకు 1600మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ప్రశాంతంగా పరీక్షల నిర్వహణకు కృషి చేసిన వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, సిబ్బందిని ఆమె అభినందించారు.

### కలెక్టరేట్‌లో నేడు బ్రెయిలీ జయంతి

నల్లగొండ : లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.వి.కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరవుతారని.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులకు ఆన్ డ్యూటీ లీవ్ సదుపాయాన్ని కల్పిస్తామని తెలిపారు. జిల్లాలోని అంధ విద్యార్థులు, ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**చదువుల తల్లికి నివాళి**



సావిత్రిబాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు
- నల్లగొండ

- ఆకట్టుకున్న పరేడ్



నల్లగొండ సమీపంలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో కవాతు చేస్తున్న శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు

# రైతు భరోసాపై ఆశలు

- సంక్రాంతి నుంచి అమలు చేయనున్నట్లు ప్రచారం
- నేడు ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం!
- యాసంగి పంటలు నమోదు చేయాలని ఆదేశం
- ఎన్ని సీజన్లకు జమచేస్తారనే విషయంపై స్పష్టత కరువు



నల్లగొండ అగ్రికల్చర్ : రైతు భరోసా (పెట్టుబడిసాయం)పై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రైతుభరోసాపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్‌కమిటీ అధ్యయనం చేయడంతో పాటు రైతుల అభిప్రాయాలను సేకరించి తుది నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. దీనిపై శనివారం నిర్వహించే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయం వెలువడనున్నట్లు తెలుస్తోంది. రైతు భరోసా ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో యాసంగి పంటల నమోదును ఈ నెల 4న నుంచి 8వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించారు.

**పంట పెట్టుబడులకు అవస్థలు**
అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చి ఎకరానికి రూ.7500లను అందిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ గత వానాకాలం, ఇప్పటి యాసంగి సీజన్‌కు రైతుభరోసా ఇవ్వలేదు. రైతుభరోసాపై కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటుచేసి నివేదిక తయారు చేసి తుది నిర్ణయం తీసుకుంటామని చెపుతూ కాలయాపన చేసింది. వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా నిధులు రైతుల జమ కాకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం అనేక అవస్థలు పడుతున్నారు.

**సాగు చేసే రైతులకే..!**
గతంలో జిల్లాలో 5,42,406 మంది రైతులకు ప్రతి సీజన్‌లో ఎకరానికి రూ.5 వేల చొప్పున రూ.624 కోట్లను రైతుల ఖాతాలో జమచేసే వారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం సాగు చేసిన భూములకు మాత్రమే రైతుభరోసా జమచేస్తామని, ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులకు భరోసాను వర్తింపజేయమని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. దానికి తోడు ఎన్ని ఎకరాల వరకు ఇవ్వాలనే దానిపై కూడా నిర్ణయం తీసుకోలేదు.

**5,83,620 ఎకరాల్లో సాగు అంచనా..**
యాసంగి సీజన్‌లో 5,83,620 ఎకరాల్లో వరి ఇతర పంటలు సాగుకానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2,01,677 వరి, జొన్న 45 , సజ్జ 337, మొక్కజొన్న 207, ఆముదం 63, వేరుశనగ 20 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పంటల నమోదు పూర్తి అయ్యే వరకు మరో 50 వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగయ్యే అవకాశం ఉంది. పంటల నమోదు ప్రక్రియ పూర్తయ్యే ఈ ఐదు రోజుల్లో మూడు లక్షల ఎకరాల్లో పంటల సాగు కావు. అయితే.. రైతు భరోసా ఎన్ని ఎకరాలను లెక్క తీసుకుంటారోననే అనుమానం రైతుల్లో నెలకొంది.

**రెండు సీజన్లకా.. ఒక సీజన్‌కా?**
రైతుభరోసాను వానాకాలం, యాసంగి సీజన్లకు ఇస్తారా.. లేక ఒక్క యాసంగికి మాత్రమే అమలు చేస్తారా అనే సందేహం రైతుల్లో నెలకొంది. దీనిపై ప్రభుత్వం గానీ, వ్యవసాయ శాఖ గానీ.. ఎలాంటి స్పష్టతను ఇవ్వలేదు. రెండు సీజన్లకు రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమచేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

**నేటి నుంచి యాసంగి పంటల నమోదు**
ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు యాసంగి పంటల నమోదు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆమె వ్యవసాయ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పంటల నమోదుపై దిశనిర్దేశం చేశారు. భూసమస్యలు ఉన్న చోట వ్యవసాయ శాఖ అధికారులకు సహకరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని 500 ఎకరాల్లో మొదటి సర్వే నంబర్ నుంచి చివరి సర్వే నెంబర్ వరకు పంటల నమోదు చేయాలని స్పష్టం చేశారు. సర్వే నెంబర్, రైతు పేరు, ఏఏ సర్వే నంబర్‌లో ఏఏ పంట వేశారు. మొత్తం ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. పంట సాగు చేయని సర్వే నంబర్ దాని విస్తీర్ణం అన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

## క్లుప్తంగా

### ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నల్లగొండ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి మనస్తాపం చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం అన్నెపర్తి సమీపంలో చోటుచేసుకుంది. నల్లగొండ మండలంలోని అన్నెపర్తికి చెందిన గంట్ల జాన్‌రెడ్డి(38)వ్యవసాయం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యంమత్తులో ఉన్న జాన్‌రెడ్డి మనస్తాపం చెంది గ్రామ సమీపంలో తిరుపతి- నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. అతడి మృతదేహాన్ని తల్లిదండ్రులు సత్తిరెడ్డి, కళమ్మలకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

### యువకుడిపై పోక్సో కేసు

సూర్యాపేటటౌన్ : పదకొండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల1న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న సాయి గణేష్ అనే యువకుడు తన పక్కింట్లో ఉంటున్న 11 ఏళ్ల బాలుడిని బలవంతంగా తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడడంతో బాలుడు అక్కడి నుంచి తప్పించుకుని అటు వైపు వెళ్తున్న స్థానికులను ఆశ్రయించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు టౌన్ సీఐ వీరరాఘవులు శుక్రవారం తెలిపారు.

### గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్: నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్సై- 2 సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువ ఇంజనీర్ కార్తీక్ మిత్ర మిర్యాలగూడ మండలం ఐలాపురం వద్ద ఈనెల 1న ఎడమ కాలువలో పడి గల్లంతయ్యాడు. గరిడేపల్లి మండలం మఠ్రికుంట బ్రిడ్జి వద్ద అతడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు.

### విద్యుదాఘాతంతో బాలుడు మృతి


ఇస్లావత్ శరత్ మృతదేహం

త్రిపురారం: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన త్రిపురారం మండలంలోని సత్యంపాడు తండా గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ కృష్ణ, సావిత్రి దంపతులకు చెందిన కుమారుడు ఇస్లావత్ శరత్(08) త్రిపురారం మండలం రాగడప గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లమని చెప్పినా వినకుండా పొలం వద్దకు వెళ్లాడు. పొలం నాటు వేస్తుండడంతో పొలంపై వాలుతున్న కొంగలు వెళ్లగొట్టేందుకు పొలంలో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో పొలంలో విద్యుత్ మోటార్ తీగలు తేలి ఉండడంతో ప్రమాదవశాత్తు వాటికి తగిలి మృతి చెందాడు. కాగా.. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

పెన్‌పహాడ్: షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కీర్తి యలమంచయ్య తన వ్యవసాయ క్షేత్రంలోని పూరి గుడిసెలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో అందులోని డ్రిప్ సామగ్రి, సుమారు 10క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. స్థానికులు ఫైర్ ఇంజన్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు.

# సృజనాత్మక వేదిక.. వైజ్ఞానిక ప్రదర్శన

- నల్లగొండలోని డాన్‌బాస్కో పాఠశాలలో సైన్స్ ఫేర్
- 100కుపైగా ప్రాజెక్టుల ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

నల్లగొండ: వ్యవసాయ తదితర రంగాల్లో ఎదురవుతున్న సమస్యలపై ఆవిష్కరణలు చేసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులను సైన్స్ విజ్ఞానం వైపు మళ్లించే విధంగా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా నల్లగొండ డాన్‌బాస్కో స్కూల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక, గణిత ప్రదర్శన చేపట్టారు. రెండు రోజుల పాటు జరగనున్న సైన్స్ ఫేర్ శుక్రవారం ప్రారంభమైంది.

#### వాటర్ బాటిల్ రాకెట్



త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి వనం వంశీకృష్ణ వాటర్ బాటిల్ రాకెట్‌ను రూపొందించాడు. ఒక ప్లాస్టిక్ వాటర్ బాటిల్ తీసుకుని అందులో సగానికి నీరు తీసి మూత వైపు సైకిల్ ట్యూబ్‌కు అమర్చే వాల్‌ను బిగించాడు. సైకిల్ పంప్‌తో ఆ వాల్‌కు గాలికొట్టి బాటిల్‌లో గాలి నింపాడు. ఆ బాటిల్‌ను తిరగల తిప్పడంతో నీరంతా కిందకు వచ్చి, గాలి పైకి చేరుకుంది. మూత తీస్తే బాటిల్‌లో ఉన్న గాలి వాటర్ ఒత్తిడి ప్రేరేపించడంతో బాటిల్ రాకెట్ తరహాలో ఎగురుతుంది. భవిష్యత్‌లో గాలితోనే విమానాలు ఎగిరే విధంగా ఈ ప్రయోగం ఉపయోగపడుతుందని విద్యార్థి వంశీకృష్ణ తెలిపాడు.

#### వైజ్ఞానిక ప్రదర్శనలో విదేశీయులు

యూరప్‌కు చెందిన క్రిష్టినా, అన్నాలు దేశ పర్యటనలో భాగంగా నల్లగొండకు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం డాన్‌బాస్కో హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. ప్రాజెక్టులు ఏ విధంగా ఉపయోగపడతాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.


ఎగ్జిబిట్లను తిలకిస్తున్న విదేశీయులు

#### సెల్ఫ్ వాటరింగ్ ప్లాంట్ మోటారు



నల్లగొండలోని బొట్టుగూడ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు మహేష్, కళ్యాణ్, సెల్ఫ్ వాటరింగ్ ప్లాంట్ మోటార్‌ను రూపొందించారు. రైతు తన పొలం ఎండి పోకుండా ఆటోమెటిక్‌గా పొలంలో నీరు తగ్గినప్పుడు మోటారు ఆన్ అయ్యేందుకు ఈ పరికరం దోహదపడుతుంది. బోరు మోటార్ నుంచి నీరు పొలంలోకి వెళ్లే విధంగా ఒక పైపు అమర్చారు. పొలంలో నీరు ఎంత ఉండాలో ఆ మట్టంలో ఆటోమెటిక్ సెన్సార్‌లను అమర్చారు. ఆ సెన్సార్‌కు వైర్ ద్వారా మరో ఎలక్ట్రికల్ బోర్డును అమర్చారు. అక్కడ సెన్సార్ ద్వారా పొలంలో నీరు తగ్గగానే ఆ సెన్సార్ నుంచి కరెంట్ బోర్డులో ఆటోమెటిక్‌గా మోటారు స్విచ్ ఆన్ అవుతుంది. తిరిగి పొలంలోకి నీరు సరిపడా చేరగానే సెన్సార్ ద్వారా ఆటోమెటిక్‌గా మోటారు స్విచ్ ఆఫ్ అవుతుంది. దీని ద్వారా రైతుకు పొలం ఎండిపోయే అవకాశం లేదు. పైగా రైతు పొలం వద్దకు వెళ్లాల్సిన పని లేకుండా ఈ ఆటోమెటిక్ సెన్సార్ పరికరం దోహదపడుతుంది.

#### ఫ్రూట్ కట్టర్




చందంపేట కేజీబీవీకి చెందిన 10వ తరగతి విద్యార్థిని ఝాన్సీ తక్కువ ఖర్చుతో కూడుకున్న ఫ్రూట్ కట్టర్‌ను రూపొందించింది. దీని సాయంతో వ్యవసాయ దారులు తమ బత్తాయి తోటల్లో పండ్లు కోసేందుకు వినియోగించుకోవచ్చు. 2 లీటర్ల ప్లాస్టిక్ వాటర్ బాటిల్ తీసుకుని, మూత వైపు గాకుండా అడుగు బాగాన్ని తామర పువ్వు ఆకారంలో కోసి బాటిల్ మూత లోపలి గుండా ఒక తాడు తీసుకొచ్చి బాటిల్ అడుగు బాగాన కట్ చేసిన మొనలకు ఆ తాడును కట్టాలి. పండుకు సరిపోయే విధంగా కట్ చేసిన ప్లాస్టిక్ బాటిళ్లకు స్ప్రింగ్ లాంటి రేకు పరికరాన్ని అతికించాలి. బాటిల్ మూత వైపు కూడా కట్ చేసి దానిని జ్యూట్ బ్యాగులోకి అమర్చాలి. ఆ తాడుకు ఒక పొడవాటి కట్టెను అమర్చాలి. దాని సాయంతో పండును బాటిల్‌లో నుంచి తాడుతో గుంజాలి. అక్కడ పండు చుట్టు అది ఉచ్చులా బిగుసుకుంటుంది. దీంతో పండు తెగి బాటిల్ నుంచి జ్యూట్‌బ్యాగ్‌లో పడుతుంది. ఇది రైతులతో పాటు పండ్ల చెట్లు పెంచే వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

#### సైకిల్ వాషింగ్ మిషన్



దామరచర్ల మండలం కొండ్రపోల్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి భరత్ సైకిల్‌వాషింగ్ మిషన్‌ను రూపొందించాడు. ఒక పాత సైకిల్ తీసుకుని వెనుక చక్రం తీసేశాడు. వెనుక చక్రం తిప్పేందుకు చైన్‌తో తిప్పే చక్రం ఉపయోగించి ఒక రాడ్‌ను కుడి వైపు గుండా అమర్చాడు. ఆ రాడ్ చుట్టూ ఒక ప్లాస్టిక్ డ్రమ్‌ను ఉంచాడు. డ్రమ్ లోపల నుంచి ఐరన్ పైప్ ఇవతల వైపున కూడా బేరింగ్ అమర్చాడు. డ్రమ్ లోపల ఉన్న ఐరన్ పైపు చుట్టూ డ్రమ్ ఆకారంలోనే జాలితో కూడిన డ్రమ్ ఆకారంలో ఉన్న జాలిని బిగించి సైకిల్ వైపు నుంచి రాడ్‌ను డ్రమ్‌లోకి వెళ్లే దారిని పూర్తిగా కప్పేశాడు. డ్రమ్ పై భాగంలో కట్ చేసి దాన్ని మూత తరహాలో రూపొందించాడు. ఆ మూత గుండా బట్టలు అన్నింటిని ఆ డ్రమ్‌లో వేసి, డ్రమ్‌లో నీరు, లిక్విడ్‌ను కూడా పోసి మూత పెట్టేసి సైకిల్ మీద కూర్చొని తొక్కాలి. దీంతో ఆ డ్రమ్ లోపల రాడ్‌తో అమర్చిన జాలి మొత్తం తిరుగుతుంది. అందులో ఉన్న బట్టలు వాషింగ్ మెషిన్‌లో ఉన్న లిక్విడ్ వాటర్‌తో కలిసి శుభ్రం చేస్తాయి. అలా ఒక అర గంట పాటు తొక్కితే వాషింగ్ మెషిన్ తరహాలో బట్టలు ఉతుక్కోవచ్చని విద్యార్థి తెలిపాడు. సైకిల్ తొక్కడం ద్వారా శరీరానికి వ్యాయామం కూడా అవుతుందని పేర్కొంటున్నారు.

#### ఫిష్ క్యాచింగ్ అండ్ గ్రౌండింగ్ డివైస్



అనుముల గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు అభినవ్ గణేష్, మోక్షజ్ఞలు ఫిష్ క్యాచింగ్ అండ్ గ్రౌండింగ్ డివైస్‌ను రూపొందించారు. ఆరు వెదురు కర్రలు తీసుకుని వాటిని గుండ్రంగా ఊచలాగా ఐరన్ వైర్‌తో కట్టారు. ఆరు కర్రల చుట్టూ మొత్తం జాలిలాగా అల్యూమినియం వైర్‌ను చుట్టారు. గుండ్రంగా ఉన్న ఈ పరికరానికి ఒక వైపు బ్యాటరీ సహకారంతో ఒక లైట్‌ను ఏర్పాటు చేశారు. అందులోకి నీరు పోకుండా ఆ బ్యాటరీ, బల్బు చుట్టు మరో పరికరాన్ని అమర్చారు. దీంతో వెలుతురుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇవతలి మూతి వైపున మొత్తం ఒక పరికరంతో మూసివేశారు. ఆ మూసిన మూతకు మధ్యలో చేప ఆ ఊచలోపలికి వచ్చే విధంగా ఒక రంధ్రం చేశారు. ఆ రంధ్రం గుండా చేప లోపలకు వచ్చిన తర్వాత ఆ రంధ్రం మూసుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఊచకు ఒక తాడు కట్టి నీటిలో వేస్తే చేపలు అందులోకి వెళ్తాయి. చేపలు పట్టేందుకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు చెబుతున్నారు.

# గంజాయి విక్రేతల అరెస్ట్

- ఒడిశా నుంచి కోదాడకు సరఫరా
- ముందస్తు సమాచారంతో పట్టుకున్న మునగాల పోలీసులు
- రెండు కిలోల గంజాయి, నాలుగు బైకులు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మునగాల: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి కోదాడలో విక్రయిస్తుండగా మునగాల పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా చిత్రకొండ గ్రామానికి చెందిన పంగి సీతారామ్ అనే వ్యక్తి గంజాయిని కోదాడకు తీసుకువచ్చి గత మూడునెలలుగా విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లాకు చెందిన ఎనిమిది మంది వ్యక్తులు ఈ గంజాయిని సదరు సీతారామ్ నుంచి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారు. మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన కొచ్చర్ల కేరీ, గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామానికి చెందిన కొచ్చర్ల ప్రేమ్‌కుమార్, నేరేడుచర్ల మండలం సోమారం గ్రామానికి చెందిన భీమిశెట్టి మహేష్, చిలుకూరు మండలం పోలేనిగూడెం గ్రామానికి చెందిన తిరగమల్ల యశ్వంత్, పసుపులేటి శబరినాథ్, కోదాడ మండలం దోరకుంట గ్రామానికి చెందిన వీరబోయిన మధు, కొమ్మగాని సాయినితీష్, చాపల రాకేష్ కొంతకాలంగా సీతారామ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి కొంత తమ వద్ద ఉంచుకొని మిగతాది చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి ప్యాకెట్ రూ.500 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 28న సీతారామ్ అనే వ్యక్తికి ఫోన్ చేసి గంజాయిని నేరుగా తమ వద్దకు తీసుకువస్తే కేజీకి రూ.10వేలు ఇస్తామని తెలిపారు. దీంతో సీతారామ్ ఈనెల 2న గంజాయితో భద్రాచలం, ఖమ్మం మీదుగా కోదాడలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్దకు చేరుకున్నాడు. వీరు గంజాయితో సహా సీతారామ్‌ను తీసుకొని మునగాల మండలం నర్సింహాపురం గ్రామ శివారులో గల మిడ్‌ల్యాండ్ హోటల్ వెనుక గల ఓ వెంచర్‌కు చేరుకున్నారు. అక్కడ సమావేశమైన వీరంతా గంజాయి ఏ విధంగా విక్రయించాలనే చర్చ చేస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు మునగాల పోలీసులు సీతారామ్‌తో సహా ఏడుగురిని పట్టుకున్నారు. నారాయణగూడెం గ్రామానికి చెందిన కొచ్చెర్ల కేరి పరారీలో ఉన్నాడు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.20వేలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి కోదాడ కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ స్పెషల్ టాస్క్‌లో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారని డీఎస్పీ పేర్కొన్నారు.

## మూడు దుకాణాల్లో చోరీ

- ఫర్టిలైజర్ షాపులో రూ.40వేల నగదు అపహరణ
- మరో రెండు దుకాణాల్లో చోరీకి యత్నం


దుకాణంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

పెద్దవూర: మండల కేంద్రంలోని మూడు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దవూర మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో ఆంజనేయ అగ్రిమార్ట్ ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణం వెనుక భాగంలో ఉన్న రేకులను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి లోనికి ప్రవేశించారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను తొలగించి దుకాణంలోని కౌంటర్‌లో ఉంచిన రూ.40వేలను అపహరించారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను సైతం తమ వెంట తీసుకెళ్లారు. ఈ దుకాణానికి సమీపంలోనే ఉన్న చిరంజీవి హార్డ్‌వేర్ దుకాణం, సతీష్ బైక్ మెకానిక్ షాపు పైభాగంలో వేసిన ఇనుప రేకులను కట్టర్‌తో కట్‌చేసి లోనికి ప్రవేశించారు. దుకాణాల్లో ఎలాంటి నగదు లేకపోవడంతో వెళ్లిపోయారు. ఉదయం దుకాణాలను తెరిచిన యజమానులకు కౌంటర్‌లు తెరిచి ఉండటం, ఇనుప రేకులు కత్తిరించి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగిందని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వీరబాబు డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరించారు. ఆంజనేయ అగ్రిమార్ట్ ఫర్టిలైజర్ దుకాణ యజమాని గిరిధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఇరువర్గాల దాడి కేసులో ఏడుగురి రిమాండ్

సూర్యాపేటటౌన్: సూర్యాపేట మండలం గాంధీనగర్ పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలో రెండు కిరాణ దుకాణాదారుల మధ్య జరిగిన దాడి కేసులో ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బాలునాయక్ శుక్రవారం తెలిపారు. గాంధీనగర్ సమీపంలో ఉన్న పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద జక్కలి అంజమ్మ, బాలెంల నాగమ్మ కిరాణం దుకాణాలు నిర్వహిస్తున్నారు. వ్యాపార విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. అయితే బుధవారం ఇద్దరి మధ్య గొడవ పెద్దది కావడంతో రెండు కుటుంబాలకు చెందిన ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ విషయమై ఇరు కుటుంబాలు సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు గాంధీనగర్‌కు చెందిన బాలెంల శ్రీకాంత్, బాలెంల ఉమేష్, బాలెంల ప్రశాంత్, బాలెంల నాగమ్మ, బాలెంల జానమ్మ, బాలెంల వీరమ్మ, బాలెంల వెంకన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## బైక్ ఢీకొని వృద్ధుడు మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మిర్యాలగూడ మండలంలోని అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన బిల్లా కృష్ణమూర్తి (70) తన ఇంటి నుంచి గ్రామంలోని పాల కేంద్రం వద్ద పాలు పోసేందుకు వెళ్లి, తిరిగి అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో నగేష్ అనే వ్యక్తి బైక్‌పై దామరచర్ల నుంచి మిర్యాలగూడ వైపు అతి వేగంగా వచ్చి కృష్ణమూర్తిని ఢీకొట్టాడు. దీంతో వృద్ధుడికి బలమైన గాయాలయ్యాయి. అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు


కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్‌లోని నందినగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును శుక్రవారం ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు కలిశారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులంతా కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రేషన్ బియ్యం వ్యాపారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: రేషన్ బియ్యాన్ని ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి రాత్రి సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న అదే రాష్ట్రంలోని దాచేపల్లి మండలం కేంద్రానికి చెందిన మందపాటి నరసింహారావుపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో నిందితుడికి పీడీ యాక్ట్ పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2015 నుంచి రేషన్ బియ్యం వ్యాపారం చేస్తుండటంతో అతడిపై అనేక కేసులు నమోదయ్యాయని, పలు కేసుల్లో జైలుకు కూడా పంపామని తెలిపారు. అయినా తీరు మార్చుకోకుండా తిరిగి రేషన్ బియ్యం వ్యాపారం సాగిస్తున్నాడని తెలిపారు. అక్రమ వ్యాపారాన్ని నిరోధించేందుకు ఎస్పీ ఆదేశాలతో పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు చెప్పారు.



## కల్తీ ఎరువులతో జాగ్రత్త!

పాడిపంట

- పంట ఎదుగుదల, దిగుబడిపై తీవ్ర ప్రభావం
- పరీక్షించుకున్న తరువాతే వాడడం మేలు



పెద్దవూర: కూరగాయల సాగు, ఉద్యానవన పంటలు, వాణిజ్య పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని అన్నదాతలు ఎరువులను విరివిగా వాడుతుంటారు. ఎరువుల్లో కల్తీ జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోతారు. వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసే ఎరువుల్లో కల్తీ ఉంటే దాని ప్రభావం పంట ఎదుగుదలతో పాటు దిగుబడులపై కూడా ఉంటుంది. ఎరువుల్లో కల్తీని గుర్తించడం, ఎరువులను పరీక్షించడం గురించి పెద్దవూర మండల వ్యవసాయ అధికారి పి.సందీప్ వివరించారు. ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

**ఎరువుల కల్తీ ఇలా..**

ప్రస్తుతం మార్కెట్‌లోకి కల్తీ, నాసిరకం, నకిలీ ఎరువులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పోషకాలు తక్కువగా ఉన్న వాటిని రైతులకు అంటగడుతున్నారు. అమ్మోనియం క్లోరైడ్, అమ్మోనియం సల్ఫేట్‌లలో ఉప్పు కలుపుతారు. సూపర్ ఫాస్ఫేట్‌లో సుద్దపొడి, జిప్సం, యూరియాలో సాధారణ ఉప్పు కలిపే అవకాశం ఉంది, ఎంఓపీలో ఇసుక, ఉప్పు కలిపే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గుళిక రూపంలోని సూపర్ ఫాస్ఫేట్‌ను డీఏపీ లేదా ఎస్‌పీజే కాంప్లెక్స్ ఎరువులుగా నమ్మించి అమ్ముతుంటారు. సాధారణ ఉప్పును కూడా ఎంఓపీగా, లేక సల్ఫేట్‌గా, మెగ్నీషియం సల్ఫేట్‌ను జింక్ సల్ఫేట్‌గా విక్రయిస్తుంటారు.

**నాణ్యత పరీక్షలు..**

- ఒక పరీక్ష నాళికలో ఒక గ్రాము యూరియాను 5 మిల్లీ లీటర్ల నీటిలో వేసి బాగా కలియబెట్టాలి. దీనిలో 5–6 చుక్కల సిల్వర్ నైట్రేట్ ద్రావణం కలపాలి. తెల్లటి అవక్షేపంగా మారితే అది కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- పొడిలా తయారు చేసుకున్న గ్రాము డీఏపీని పరీక్ష నాళికలో వేసి 5 మిల్లీ లీటర్ల స్వచ్ఛమైన నీటిలో కలపాలి. దానికి ఒక మిల్లీ లీటర్ నైట్రిక్ యాసిడ్ వేసి కదిపితే అర్థ పార్శక ద్రావణం ఏర్పడితే అది నాణ్యమైనదిగా, అలా కాకుండా కరగని పదార్థం అడుగు భాగంలో చేరితే కల్తీదిగా భావించాలి.
- పరీక్ష నాళికలో ఒక గ్రాము మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంఓపీ) ఎరువులో 5 మిల్లీ లీటర్ల నీటిని పోసి బాగా కరిగేటట్లు చేయాలి. కొద్దిపాటి ఎరువు పదార్థం నీటిపై తేలితే స్వచ్ఛమైన ఎరువుగా, ఎక్కువ మొత్తంలో కరగకుండా అడుగుభాగం చేరితే అది కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- కాంప్లెక్స్ ఎరువుల విషయంలో గ్రాము ఎరువును 5 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి బాగా కదపాలి. దీనికి మిల్లీ లీటర్ సోడియం హైడ్రాక్సైడ్ ద్రావణం కలిపి ఒక వైపు నుంచి పరీక్ష నాళికను వేడిచేయాలి. తడిగా ఉన్న ఎర్ర లిట్మస్ పేపర్‌ను పరీక్ష నాళిక ద్వారం దగ్గర ఉంచితే లిట్మస్ కాగితం నీలి రంగులోకి మారితే నత్రజని ఉందని గుర్తించాలి. అదే పరీక్షకు 2 మిల్లీలీటర్ల ఫెర్రిక్ క్లోరైడ్ అమ్మోనియం ఎసిటేట్ కలపాలి. పసుపు రంగు అవక్షేపం వస్తుంది. దీనికి 5–6 చుక్కల నైట్రిక్ యాసిడ్ కలిపితే అవక్షేపం కరిగిపోతుంది. అలా జరిగితే ఫాస్ఫేట్ ఉన్నట్లు గుర్తించాలి.
- గ్రాము ఎరువును తీసుకుని 5 మిల్లీ లీటర్ల నీటిలో ఎరువును కరిగించాలి. ఫిల్టర్ పేపర్ సాయంతో వడపోయాలి. దీనికి 2 మిల్లీ లీటర్ల ఫార్మ డీహైడ్ ద్రావణం కలపాలి. 5 నిమిషాల తర్వాత ద్రావణం ఎరువులా మారుతుంది. దీనికి సోడియం హైడ్రాక్సైడ్ ద్రావణం ఒక్కొక్క చుక్క పసుపు రంగు వచ్చేదాకా కలపాలి. దీనికి మిల్లీ లీటర్ కోబాల్ట్ నైట్రేట్ ద్రావణం కలిపితే పసుపు పచ్చ అవక్షేపం ఏర్పడుతుంది. ఇలా జరిగితే ఎరువులో పొటాష్ ఉన్నట్లు గుర్తించాలి.
- ఎరువుల కొనుగోలు విషయంలో దుకాణం గుడ్‌విల్‌ను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. కొనుగోలు సమయంలో రశీదులు తీసుకోవడం మర్చిపోకూడదు. ఎరువుల పరీక్షలు చేయడం రైతులకు ఇబ్బంది అనిపించినా, అనుమానం వచ్చినా వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలి.